క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆవిష్కరించారు. ఆదివారం రాజారెడ్డి వీధిలోని తన కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరించి, ఉపాధ్యాయ నాయకులు అభినందనలు తెలిపారు. ఉర్దూలో క్యాలెండర్ రూపొందించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేసిన తర్వాత...

సాక్షి ఎఫెక్ట్...

కడప కార్పొరేషన్: కడప నగరం సెంట్రల్ జైలు సమీపంలో జగనన్న కాలనీ వద్ద తాగునీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీని నగరపాలక అధికారులు మరమ్మతులు చేయించారు. ఈ లీకేజీ వల్ల పెద్ద ఎత్తున నీరు వృథా అవుతున్న విషయాన్ని ఈనెల 15వ తేది సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. అధికారుల స్పందనపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

18న డీవైఎఫ్‌ఐ నమూనా కానిస్టేబుల్ పరీక్ష

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే నమూనా కానిస్టేబుల్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పలు కోచింగ్ సెంటర్లలో నమూనా కానిస్టేబుల్ పరీక్ష్ర కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీ పరీక్షను కెఎస్ లక్ష్మణ రావు గారి సారథ్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కానిస్టేబుల్ పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీవైఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు షాకీర్ పాల్గొన్నారు.

కనిపించని వారి ఆచూకీ కోసం సంప్రదించండి

కడప కోటిరెడ్డిసర్కిల్: తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కనిపించకుండా పోయినట్లయితే సంబంధీకులు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కడప రైల్వే పోలీసుస్టేషన్ ఎస్‌ఐ రారాజు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. కడప రైల్వే పోలీసుస్టేషన్‌లో 2020 సంవత్సరంలో రెండు కేసులు, 2021లో ఏడు కేసులు, 2022 సంవత్సరంలో 11 గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించిన కేసులు నమోదై ఉన్నాయన్నారు. అలాంటి వారు స్టేషన్‌లో సంప్రదిస్తే అందుకు సంబంధించిన వివరాలు తెలిసి వస్తాయన్నారు. ప్రజలు తమ వారి మిస్సింగ్ సంఘటనకు సంబంధించి 94409 00811, 94406 46974 నెంబర్లకు సమాచారాన్ని తెలియజేయాలని వివరించారు.

శ్రీ కాలభైరవస్వామి ఆలయానికి విరాళం



ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కడప కల్చరల్: కడప నగర సమీపంలోని కాలభైరవపురం (ఎంఎస్ కొట్టాల) గ్రామంలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సోమవారం రూ. 25 వేలును విరాళంగా అందజేశారు. ఆలయ చరిత్రను తెలుసుకున్న హైదరాబాదుకు చెందిన విర్కో ఫార్మాసూటికల్స్ అధినేత ముండ్ల శ్రీనివాసులురెడ్డి రూ. 20 వేలు, కడప నగరానికి చెందిన శ్రీవైభవలక్ష్మి జ్యువెలర్స్ అధినేత చింతగింజల యశోధర్ రూ. 5 వేలు స్వామి సన్నిధిలో బాసట స్వచ్ఛంద సేవా సంస్థఅధ్యక్షులు, ఆలయ నిర్వాహకులు మేరువ బాలాజీరావుకు అందజేశారు. కాలభైరవ అష్టమి సందర్భంగా వారు ఇతర భక్తులతో కలిసి స్వామి మూలమూర్తికి అభిషేకం, అలంకారం నిర్వహించారు. కార్యక్రమంలో జి.పురుషోత్తం, శ్రీను, రాజేష్, చంద్ర తదితరులుపాల్గొన్నారు.

ఉల్లాసభరితం..పార్వేట ఉత్సవం



పార్వేటకు తరలి వెళుతున్న శ్రీ వాసవీ కన్యకాంబ, శ్రీ సీతారామలక్ష్మణులు



పార్వేట ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

కడప కల్చరల్: కడప నగరంలో పలు దేవాలయాలకు సంబంధించి పార్వేట ఉత్సవాలను ఉల్లాస భరితంగా నిర్వహించారు. పండుగ ఆనవాయితీగా కడప నగరంలోని అన్ని ప్రముఖ వైష్ణావాలయాల నుంచి మూడు రోజులు పూజలందుకున్న దేవతా మూర్తులు దుష్ట శిక్షణకై ప్రత్యేకించి పశు పాలకులపై దాడి చేస్తున్న అటవీ మృగాలను తుదముట్టించేందుకు తరలి వెళ్లారు. నగరానికి చెందిన దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఉభయ దేవేరులతో, ఇతర ఆలయాల నుంచి స్వామి, అమ్మవార్లు మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం వద్ద పార్వేట ప్రాంతానికి చేరుకున్నారు. ఆయా ఆలయాల వద్ద నుంచి రంగురంగుల పల్లకీపై విద్యుద్దీప కాంతులతో, బాణాసంచా వెలుగుల మధ్య మంగళ స్వరాల నీరాజనంతో దేవతామూర్తులు తరలి వెళ్లారు.

మూడురోజులపాటు పండుగ సందర్భంగా భక్తుల పూజలందుకున్న స్వామి, అమ్మవారితోసహా ఆటవిడుపుగా అడవిలోకి వేటకు వచ్చాడని అర్చకులు పేర్కొన్నారు. అరణ్యంలోని క్రూర జంతువులు ఊరిపై పడి సాధు జంతువులను వధించకుండా వాటిని మట్టుబెట్టేందుకు స్వామి, అమ్మవార్లు వేటకు వచ్చారన్నారు. అత్యంత ఉల్లాస భరితంగా సాగిన ఈ కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మైదానంలో దేవతామూర్తులను శాంతింపజేసే పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారిశాల నుంచి ఆర్యవైశ్య ప్రముఖులు రమణ, రాంమహేష్, సతీష్ పాల్గొన్నారు. పిల్లలకు గాలిపటాలను అందజేశారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య దేవతామూర్తులకు విజయగర్వంతో ఆలయానికి తిరిగి వెళ్లారు.

గోవు మాలక్ష్మికి కోటి దండాలు!

గోవు మాలక్ష్మికి కోటి దండాలు...గోవున్న ఇంటిలో కలవు అన్ని సిరులు అంటూ భక్తులు సోమవారం గోమాతకు పూజలు నిర్వహించారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా తిరుమల, తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో అనుబంధ సంస్థ ధర్మ ప్రచార పరిషత్ శనివారం కడప నగరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో గోపూజ నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాంబ ఆలయంలో ఉదయం సువాసినులైన మహిళలు, యువతులు గోమాతకు పసుపు, కుంకుమలు అలంకరించి వస్త్రాలు సమర్పించి పూలమాలలతో అలంకరించారు. అర్చకులు వేదమంత్రోచ్చాటనల మధ్య భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధి బెస్తవేముల రామమహేష్ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో ఇలాంటి సంప్రదాయాలను కొనసాగించే ప్రయత్నం చేస్తుండడం అభినందనీయమన్నారు. అమ్మవారిశాల కమిటీ సభ్యులు పడుచూరి వెంకట నరసింహులు, సాయి, రాంప్రసాద్, సుదర్శన్, సుధాకర్, రమేష్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి వేడుకలు

కడప శిల్పారామంలో ఆది, సోమవారాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర శిల్పారామాల అధికారుల సూచన మేరకు పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సందర్శకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సిబ్బంది శిల్పారామం ఆవరణలో గొబ్బెమ్మను ఏర్పాటు చేసి పాటలు పాడారు. బాలలు ఆనందంతో కేరింతలు కొట్టారు. పండుగ సందర్భంగా చిన్నారులతో గాలి పటాలను ఎగురవేయించారు. రాత్రి బైరెడ్డిపల్లె కళాతరంగిణి కళాకారులు, స్థానిక మిస్బా మూవీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంప్రదాయాలతో కూడిన తమ ఆటపాటలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

శ్రీనగర్ కాలనీలో సంక్రాంతి

స్థానిక శ్రీనగర్ కాలనీ విద్యానగర్ బోర్డు సమీపంలో సోమవారం కనుమ పండుగను సంప్రదాయ బద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కాలనీల మహిళలు, సంక్రాంతి సంబరాల్లో భాగంగా గొబ్బెమ్మను తయారు చేసి సామూహికంగా పూజలు నిర్వహించారు. బాలబాలికలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు

కడప కార్పొరేషన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక 28వ డివిజన్‌లో వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సాయిదత్త ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

వస్త్రాలు పంపిణీ

సంక్రాంతి పండుగ సందర్భంగా నిరాశ్రయులు, అనాథలకు సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కె. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.



గోపూజలో పాల్గొన్న భక్తులు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న శ్రీనగర్ కాలనీ వాసులు



28వ డివిజన్లో మహిళలకు బహుమతులు అందజేస్తున్న సుబ్బారెడ్డి



శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

పెద్దదర్గా సన్నిధిలో సినీ నటుడు చంద్రదీప్

కడప కల్చరల్: ప్రముఖ సినీనటుడు, బాహుబలి సినిమా విలన్ చంద్రదీప్ సోమవారం కడప నగరంలోని ప్రముఖ సూఫీ క్షేత్రం అమీన్‌పీర్ (పెద్ద) దర్గాను దర్శించుకున్నారు. చాదర్‌తో చేరుకున్న ఆయనకు దర్గా ముజావర్ అమీర్ స్వాగతం పలికారు. దర్గా సంప్రదాయంగా వారికి పేటా చుట్టి సాంప్రదాయ వస్త్రాలు ధరింపజేశారు. తొలుత ఆయన దర్గాలోని ప్రధాన గురువుల మజార్‌ను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. హజరత్ అమీన్‌పీర్ సాహెబ్ మజార్ వద్ద కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ముజావర్ అమీర్ వారికి దర్గా చరిత్ర, విశిష్ఠతలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండోమారు దర్గా దర్శనం చేసుకోవడం సంతోషాన్ని ఇస్తోందన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బద్వేలు అర్బన్ : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక పోస్టాఫీసు ఆవరణలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఓపెన్ కేటగిరి షటిల్ బాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్న మహేష్, సోనీ జట్టుకు, ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్న సునీల్, వెంకటేష్ జట్టుకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, పోస్టుమాస్టర్ ధనమ్మ, మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి, 26వ వార్డు కౌన్సిలర్ పుత్తామహేష్, హెడ్ కానిస్టేబుల్ గురవయ్య, ఆర్గనైజర్లు చక్రి, చెన్నయ్య, మల్లయ్య, సునీల్, మధు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1989–1990 సంవత్సరంలో ఇక్కడ పదవ తరగతి చదివిన 100 మంది విద్యార్థుల్లో 70 మంది సోమవారం నాటి గురువులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకున్నారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తూ కళాశాల వద్దకు ప్రదర్శనగా వచ్చారు. సమ్మేళనంలో ఒకరిని ఒకరు పలరించుకొని, కుటుంబ వివరాలు తెలుసుకుంటూ, ఒకరి అనుభవాలు మరొకరితో పంచుకుంటూ ఉల్లాసంగా గడిపారు. మధ్యాహ్నం అందరూ కలసి సంక్రాంతి పండుగ విందు భోజనాలు చేశారు.

ఘనంగా కనుమ సంబరాలు



వీరపునాయునిపల్లె: గోనుమాకులపల్లెలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కమలాపురం: కమలాపురం–ఖాజీపేట ప్రధాన రహదారిలో పట్టణ శివారులోని పాగేరు వంక వద్ద కనుమ పండుగ పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన పారువేట ఉత్సవం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. పట్టణం నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి తరలి వచ్చిన అశేష ప్రజానీకంతో పాగేరు వంక ప్రాంతం కిటకిట లాడింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నీలం నరేంద్ర ఆధ్వర్యంలో పురుషులకు కబడ్డీ, బండ లాగుడు పోటీలు, వాలీబాల్, మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు పట్టణంలోని శివాలయం నుంచి పాగేరు వంక వరకు శివ పార్వతులను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అలాగే కంచి వరదరాజ స్వామి వారిని ఆలయం నుంచి పాగేరు వంక వరకు ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా స్వామి వారిని తీసుకువచ్చారు.

పోటీల నిర్వహణ అభినందనీయం:

పాగేరు వంక సమీపంలో కనుమ పురస్కరించుకొని పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కాగా అక్కడ ఏర్పాటు చేసిన బండ లాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందించారు. మిగిలిన వారికి కన్సోలేషన్ బహుమతుల కింద బకెట్లు పంపిణీ చేశారు.

చెన్నూరు : చెన్నూరు మండలం కొండపేట పెన్నానదిలో సోమవారం సాయంత్రం కనుమ పండుగను పురస్కరించుకుని పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కొండపేట గ్రామంలో ఉన్న ఉమామహేశ్వరస్వామి (శివాలయం) ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగింపుగా కొండపేట పెన్నానది వద్దకు తీసుకు వచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. అనంతరం స్వామి వారిని ఊరేగింపుగా కొండపేట పురవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు. పెన్నానదిలో పార్వేట ఉత్సవంలో భాగంగా తిరునాలను నిర్వహించారు. కనుమను పురస్కరించుకుని చెన్నూరు, కొండపేటతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మహిళలు గొబ్బెమ్మలతో నృత్యాలు చేసుకుంటూ పెన్నానది వరకు వెళ్లి నదిలో నిమజ్జనం చేశారు.

వీరపునాయునిపల్లె: హిందువుల సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. మండలంలోని గోనుమాకులపల్లె గ్రామంలో గుర్రప్ప యాదవ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు రాజశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలలో ఆయన పాల్గొన్నారు. మండల స్థాయి రంగవల్లుల పోటీలు, క్రికెట్ పోటీలు నిర్వహించారు.

బహుమతులు పంపిణీ

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రవణ్ టీం మొదటి బహుమతి గెలుచుకోగా, రెండో బహుమతి మహేంద్ర టీం గెలుచుకుంది. మొదటి బహుమతిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరు నాగేంద్రారెడ్డి, రెండో బహుమతి ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి ఇచ్చారు. ఈ నగదు బహుమతులను సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి ప్రదానం చేశారు.

అడా చైర్మన్‌కు సన్మానం

బద్వేలు అర్బన్ : అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగసాని గురుమోహన్‌ను సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఆయన స్వగృహంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు మాలేపాటి సునీల్‌కుమార్, మాలేపాటి సురేంద్రకుమార్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుమోహన్ రాబోవు రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

బోరు ఏర్పాటుకు సహకారం

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి బావ అయిన పెద్దిరెడ్డి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు విజయ నరసింహా రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు మేకవారిపల్లె గ్రామంలోని శ్మశానానికి సంబంధించి ఆదివారం బోరు, చేతిపంపు, మోటారు, స్నానపు గదుల నిర్మాణానికి అవసరమయ్యే ఖర్చును వితరణగా అందజేశారు. దీనికి సంబంధించి బోరును వేయించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉప్పరపల్లెకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణలో భాగంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని ఉప్పరపల్లెకు రానున్నట్లు ఎంపీటీసీ ఎరసాని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆటను ఆస్వాదించాలి

జమ్మలమడుగు: ప్రతి క్రీడాకారులు తమలో దాగి ఉన్న ప్రతిభను బయటికి తీసి ఆటలను ఆస్వాదించాలని మే ఐ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్‌మోరె పేర్కొన్నారు. సోమవారం డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రికెట్ జట్టుకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని స్థానిక పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. అనంతరం సీపీఎం నాయకుడు శివనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

కొండాపురం: మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి పేర్లతో సంక్రాంతి సంబరాల పోటీలను వైభవంగా నిర్వహించినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. హరినారాయణరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులు గా ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాదు, తాళ్ళప్రొద్దుటూరు ఎస్‌ఐ జె. రవికుమార్, ఉప మండలాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జి. విజయ భాస్కర్ రెడ్డి, జోగాపురం ప్రతాప్‌రెడ్డి, తాళ్లప్రొద్దుటూరు సింగిల్ విండో అధ్యక్షుడు జగ్గు పుల్లన్న పాల్గొన్నారు.

కడప దిశలో సంక్రాంతి పండుగ వేడుకలు



దిశ సిబ్బందికి స్వీట్స్‌ను అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: కడప నగరంలోని దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఘనంగా సంక్రాంతి పండుగ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌లలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సాహభరిత వాతావరణంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. జిల్లా ప్రజలకు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కడప దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆర్. వాసుదేవన్, సీఐ వినయ్‌కుమార్‌రెడ్డి, కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి. నాగరాజు, ఎస్‌ఐలు, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి వెండి గొడుగు బహూకరణ



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అమ్మవారికి నరసింహారెడ్డి అనే భక్తుడు మూడున్నర కిలోల వెండి గొడుగును బహుకరించాడు. దీని విలువ దాదాపు రూ.2.85 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని తొగటవీర క్షత్రియ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని తొగటవీర క్షత్రియ కళ్యాణమండపంలో పేద తొగట కుల విద్యార్థులకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. 8 మంది విద్యార్థులకు రూ 65వేలు అందించారు. అలాగే ఓ ఇంటర్ విద్యార్థినిని సంఘం ఆధ్వర్యంలో చదివిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చౌడం రమణ, ఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, సభ్యులు చిన్నపుల్లయ్య, రామయ్య, ఉబ్బయ్య, కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, కార్యదర్శి పల్లా శేషయ్య, గోవింద్, తులసీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు

హిందూత్వం అనేది జీవన విధానం

ప్రొద్దుటూరు కల్చరల్ : హిందుత్వం అనేది జీవన విధానమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలో సంక్రాంతి సందర్భంగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తుల ఆధారంగా కులాలు ఏర్పడ్డాయన్నారు. ప్రతి హిందువు బంధువు అన్న భావనతో మెలగాలన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, దక్షిణ ప్రాంత ప్రముఖ్ మారెళ్ల మల్లికార్జున రావు, మార్కండేయ, వెంకటరమణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

చెన్నూరు : చెన్నూరు మైనార్టీ కాలనీ 4వ వార్డులో గల షేక్ ఖాదర్ (బొంబాయి దాదా) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని మండల కో ఆప్షన్ సభ్యులు వారిస్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన పోచిమరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా దహన సంస్కారాల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అన్వర్, షేక్‌హజ్రత్, పూల షబ్బీర్, నాయబ్, వైఎస్సార్ సీపీ నాయకులు, మైనార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

సిద్దవటం : ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు ఉంటాయని కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని కడపాయపల్లె పంచాయతీ మంగనవాండ్లపల్లె గ్రామాన్ని సోమవారం కడప డీఎస్పీ సదర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో శాంతి భద్రతలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడ సమస్యలు ఏవైనా ఉన్నాయా, గొడవలు ఏవైనా జరుగుతున్నాయా, జూదం, మట్కా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు తెలిపారు. గ్రామానికి సంబంధించి మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సైబర్ నేరాలకు బాధితులు కాకూడదని, ఏవైనా కొత్త యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకూడదని, స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.